సాక్షి నిర్మల్

శనివారం ౹ 24 ౹ జూన్ ౹ 2023



మాయ'లేడీ' బాగోతం

మోసపోయేవారు ఉంటే మోసం చేసేవారికి కొదవ లేదన్నట్టుగా మాయలేడీ' తోట రజిత బాగోతాలు తవ్వినకొద్దీ బయటపడుతున్నాయి.

10లో▸



ఉద్యోగార్థులకు పఠన కేంద్రాలు

ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువతకు ఉపయోగపడేలా జిల్లాలో పబ్లిక్ రీడింగ్ రూం(పఠన కేంద్రం)లు ఏర్పాటు చేస్తున్నారు.

11లో▸

గరిష్టం/కనిష్టం

29.5 /25.5

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. జిల్లాలోని చలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లీగల్ ఎయిడ్ సర్వీసెస్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేస్తున్న జిల్లా జడ్జి కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం సర్వీసెస్‌ను వర్చువల్ విధానంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయన్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కర్ణకుమార్ మాట్లాడుతూ.. తమ కేసుల పరిష్కారంలో న్యాయవాదిని నియమించుకోలేని పరిస్థితిలో ఉన్న వారి కోసం ప్రభుత్వం ఉచితంగా ఒక న్యాయమూర్తిని కేటాయిస్తుందన్నారు. ప్రజలు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఇందులో సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్, నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్‌డే రన్



ఒలింపిక్‌డే రన్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: అంతర్జాతీయ ఒలింపిక్ డే పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ శుక్రవారం నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ రాంబాబు జెండాను ఊపి రన్ ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు రన్ కొనసాగింది. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల రాంచందర్, పెటా అధ్యక్షుడు రమేశ్, జనరల్ సెక్రెటరీ భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రమణారావు, పీడీలు సుదర్శన్‌సింగ్, శ్రీనివాస్, వెంకటరమణ, దేవేందర్, సత్తయ్య, భూమన్న, లక్ష్మణ్, అంబాజీ, పీఈటీలు అన్నపూర్ణ, సంగీత, వెన్నెల, జమున విద్యార్థులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక



గోరింటాకు వేడుకల్లో మహిళలు

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన అద్భుత్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాస సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులందరూ గోరింటాకు పెట్టుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో ప్రత్యేకతలు ఉండి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే ఆషాఢమాసం, వర్ష రుతువులో గోరింటాకు పెట్టుకుంటే చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఔషధ గుణాలున్న గోరింటాకు పెట్టుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా బాగుంటుందని పేర్కొన్నారు.

ఖానాపూర్ చేరిన పాదయాత్ర



స్వామిజీని సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

ఖానాపూర్: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ఇస్కాన్ ఆలయం నుంచి ఏప్రిల్ 13న పాదయాత్రగా బయల్దేరిన అచ్యుతానందదాస్ స్వామిజీ పాదయాత్ర ఖానాపూర్ మండలానికి చేరుకుంది. గురువారం రాత్రి ఖానాపూర్ చేరుకున్న స్వామీజీకి పట్టణంలోని వాసవీమాత ఆలయంలో బస ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ మునులు దేశానికి పురాణాలను అందించిన త్యాగధనులన్నారు. సనాతన సంప్రదాయాల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ప్రతీ రాష్ట్రాన్ని సందర్శించి పుణ్యక్షేత్రాలు, తీర్థాలను దర్శించుకుంటున్నట్లు వివరించారు. రామేశ్వరం, కన్యాకుమారి, చార్‌ధామ్, పూరీజగన్నాథ్ తదితర క్షేత్రాలను సందర్శించేందుకు 12 ఏళ్ల దేశమంతా పర్యటిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, అర్చకులు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చేనమ్మా..



పీచరలో పత్తి విత్తేందుకు చేను సిద్ధం చేస్తున్న రైతు



నిర్మల్‌లో కురుస్తున్న వర్షం



వానలో గొడుకు పట్టి ప్రయాణం..

- పలకరించిన తొలకరి..
- పులకరించిన నేల
- ఊపందుకున్న వ్యవసాయ పనులు..
- విత్తనాలు వేసే పనుల్లో రైతులు

లక్ష్మణచాంద/నిర్మల్ ఖిల్లా/కుంటాల: వాన చినుకు కోసం 20 రోజుల అన్నదాత నిరీక్షణ ఫలించింది. రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించడంతో వరుణుడు రైతులపై కరుణ చూపాడు. గురువారం రాత్రి, శుక్రవారం వేకువ జామున జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసింది. తొలకరి పలకరించడంతో నేల పులకరించింది. జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూన్ మూడో వారం వచ్చినా వాన చినుకు లేకపోగా, భగ్గుమన్న భానుడితో జిల్లా ప్రజలు ఇబ్బంది పడ్డారు. విపరీతమైన వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. తొలకరి వానతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యంతో ఆందోళన చెందుతున్న రైతులు తొలకరి వానే మోస్తారుగా కురవడంతో రైతులు విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం మంచిరోజు కావడం ఉదయమే రైతులు పొలంబాట పట్టారు. రోజంతా వాతావరణం చల్లగా ఉండడంతో వ్యవసాయ పనులకు జోరందుకున్నాయి. ఇదే తీరులో వర్షాలు కోరుకుంటున్నారు.

కిటకిటలాడిన విత్తన దుకాణాలు..

జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణాల్లో నిర్మల్ పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన రైతులు విత్తనాల కోసం రావడంతో విత్తనదుకణాలు కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సీడ్స్ దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. పత్తి, సోయాబీన్, మిరప తదితర పంటలకు చెందిన విత్తనాలు గణనీయంగా అమ్ముడవుతున్నట్లు యజమానులు అంటున్నారు.

వ్యవసాయ పనులు షురూ..

తొలకరి పలకరించడంతో జిల్లా అంతటా అన్నదాతలు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు పత్తి, మొక్కజొన్న, సోయా విత్తనాలు విత్తుకున్నారు. పసుపు రైతులు పసుపు విత్తన శుద్ధి పనుల్లో నిమగ్నమయ్యారు. ఎద్దులు ఉన్న రైతులు ఎద్దులు, అరకతో విత్తనాలు వేయగా, ఎద్దులు లేని వారు ట్రాక్టర్ సహాయంతో విత్తుకున్నారు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం(మి.మీలలో)
కుంటాల	58.2
కడెం	58
దస్తురాబాద్	41
దిలావర్‌పూర్	36.8
ఖానాపూర్	32
నిర్మల్ అర్బన్	29
నిర్మల్ రూరల్	26.8
నర్సాపూర్(జి)	24.8
సారంగాపూర్	22.4
మామడ	19.4
లక్ష్మణచాంద	16
పెంబి	8.6
సోన్	4.8



రాచాపూర్ వద్ద పసుపు విత్తనం శుద్ధి చేస్తున్న రైతులు



కుంటాలలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

పేదల బియ్యం పక్కదారి!



భైంసాలో పట్టుబడిన రేషన్‌బియ్యం బస్తాలు(ఫైల్)

- దొడ్డు బియ్యం తినలేక అమ్ముకుంటున్న లబ్ధిదారులు
- అవకాశాన్ని ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు

భైంసాటౌన్: పేదల ఆకలి తీర్చేందుకు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం రూపాయికి కిలో బియ్యం అందిస్తుండగా, చాలామంది లబ్ధిదారులు దొడ్డుబియ్యం తినేందుకు ఇష్టపడడం లేదు. ఇదే అక్రమదందా నిర్వాహకులకు కలిసివస్తోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.12కు కొనుగోలు చేసి మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు తరలించి రూ.22 వరకు విక్రయిస్తున్నారు. దీంతో కిలోకు రూ.పది చొప్పున ఆర్జిస్తుండడంతో ఈ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడినా దందా ఆగడం లేదు. అక్రమ వ్యాపారంతో రూ.లక్షల్లో ఆదాయం ఉండడంతోనే మళ్లీ అదే దందా కొనసాగిస్తున్నారు. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల అధికారులు సైతం దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం లేదు. ఏడాదికి ఒకటి, రెండు సార్లు పట్టుబడినా.. పెద్దగా నష్టం ఉండడం లేదనే భావనతో యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు.

రేషన్ దుకాణాల నుంచే..!

జిల్లాలో 2.08 లక్షల తెల్లరేషన్ కార్డులుండగా, నెలకు 35.89 వేల క్వింటాళ్ల బియ్యం కోటా అవసరం. కాగా, రేషన్ కార్డుదారులు కొంతమంది బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర వేసి బియ్యాన్ని డీలర్లకే రూ.పదిచొప్పున విక్రయిస్తున్నారు. ఇలా సేకరిస్తున్న బియ్యాన్ని డీలర్లు కిలోకు రూ.2 నుంచి రూ.5 వరకు అధిక ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. కొంతమంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని రూ.2 నుంచి రూ.5 లాభంతో దళారులకు విక్రయిస్తున్నారు. వీరు రైస్‌మిల్లులు, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు తరలించి కిలోకు రూ.22 వరకు విక్రయిస్తున్నారు. రైస్‌మిల్లర్లు ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తుండగా, మహారాష్ట్రలో ఆల్కహాల్ తయారీకి వాడుతున్నారు. దొడ్డు బియానికి డిమాండ్ ఉండడంతో ఈ దందా జోరుగా సాగుతోంది.

నిర్జన ప్రదేశాల్లో డంప్...

తెల్లరేషన్ కార్డుదారుల నుంచి దళారుల ద్వారా బియ్యం సేకరిస్తున్న వ్యాపారులు వాటిని నిర్జన, శివారు ప్రాంతాల్లో రహస్యంగా డంప్ చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై తీసుకొచ్చిన బియ్యం కొనుగోలు చేసి రహస్య గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో పోగయిన బియ్యాన్ని రైస్ మిల్లులు, ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతోపాటు దాదాపు అన్ని మండలకేంద్రాల్లో రేషన్‌బియ్యం అక్రమ దందా సాగుతోంది.

దొడ్డు బియ్యం పంపిణీతో...

ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు రూ.1కి కిలో బియ్యం చొప్పున ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం అందిస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు ఐదుకిలోలే అందిస్తున్నారు. అయితే తెల్లరేషన్ కార్డు కలిగినవారిలో కొంతమంది అధికాదాయ వర్గానికి చెందిన వారు ఉన్నారు. వీరు దొడ్డు బియ్యం తినేందుకు ఆసక్తి చూపక విక్రయిస్తున్నారు. అలాగే పేదలు కూడా చాలామంది దొడ్డు బియ్యం తినలేక అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం అర్హులైన పేదలకు కూడా సన్న బియ్యం అందిస్తే పథకంతో ప్రయోజనం చేకూరుతుంది.

చర్యలు తీసుకుంటాం..

పేదలకు అందిస్తున్న రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా రేషన్ బియ్యం దందా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలి.

– జాదవ్ ప్రకాశ్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, భైంసా

'హద్దు'దాటుతున్న అక్రమ దందా!

పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి అక్రమార్కులు ఇసుకను జిల్లాకు తరిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసే జరుగుతున్నా ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమ దందా హద్దులు దాటుతోంది. అప్పుడప్పుడు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలనూ 'మామూలు'గా తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



జౌలా(బి) వాగులో ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్

- మహారాష్ట్ర నుంచి తానూరుకు జోరుగా ఇసుక రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

తానూరు: మహారాష్ట్రలోని ధర్మాబాద్, రాహెర్, నాగని, గోలేగాం, బలేగాం గ్రామాల సరిహద్దు గుండా గోదావరి ప్రవహిస్తోంది. ప్రస్తుతం నదిలో నీరు తగ్గిపోవడంతో అక్కడి వ్యాపారులు ఇసుకను తవ్వి సరిహద్దున ఉన్న తానూరు మండలంలోని గ్రామాల్లోకి తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి రాత్రి వేళ వాహనాల్లో అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. తద్వారా అటు మహారాష్ట్ర ఇటు తెలంగాణ ప్రభుత్వాలు ఆదాయం కోల్పోతున్నాయి. మహారాష్ట్ర నుంచి రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక సరిహద్దులు దాటి వస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. పోలీసులు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఉదయం ఫోన్ చేసి అర్డర్ చేస్తే.. రాత్రి ఇసుక ఇంటికి చేరుతోంది. అప్పుడప్పుడూ పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇసుక టిప్పర్లను పట్టుకుంటున్నా సంబంధిత శాఖ అధికారుల్లో మాత్రం చలనం లేదు.

వాగుల నుంచి రవాణా...

కొంత మంది వ్యాపారులు, పలుకుబడి ఉన్నవారు అభివృద్ధి పనుల పేరిట తానూరు మండలం ఎల్వత్ వాడవన, జౌలా(బి) వాగుల నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు ఇసుకను డంప్ చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. గతేడాది జౌలా(బి) గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఇసుక తవ్వకాలు ఆపాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు దందా జోరుగా సాగిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అనుమతి లేకుండా మహారాష్ట్రలోని ఇసుకను జిల్లాకు తీసుకువచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడతున్నారు. ఒక టిప్పర్ లోడ్‌లో సుమారుగా 12 బరాస్‌ల ఇసుక వస్తోంది. అయితే ఇక్కడ ప్రభుత్వానికి ఒక టిప్పర్‌కు రూ.3 వేల చలానా కట్టాల్సి ఉంటుంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఇసుకకు ఎలాంటి చలానా కట్టడం లేదు. రాత్రి వేళల్లో అక్రమ దందా సాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు తానూరు మండలంలోని పలు గ్రామాలకు ఇసుక తరలిస్తున్నాయి. ఇసుక అవసరం ఉన్న వారు సంబంధిత శాఖ అధికారుల అనుమతి పొందాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందా కొనసాగిస్తున్నారు.



జౌలా(బి) రోడ్డుకు నిల్వచేసి ఉన్న ఇసుక

వాట్సాప్‌లో ఆర్డర్..

మహారాష్ట్ర వ్యాపారులకు కొంత మంది ఇక్కడి వ్యాపారులు ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. ఇసుక కావాల్సిన వారు ఇక్కడి ఏజెంట్లను సంప్రదిస్తే వారు మహారాష్ట్ర వ్యాపారులకు వాట్సప్‌లో ఊరితో పాటు, అడ్రస్ పంపిస్తారు. అక్కడి వ్యాపారులు రాత్రి టిప్పర్ పంపించే విషయాన్ని ఇక్కడి ఏజెంట్లకు ఫోన్‌లో సమాచారం అందిస్తారు. ఇక్కడ పోలీసుల పెట్రోలింగ్ నిర్వహించే వివరాలను తెలుసుకుని రాత్రి వేళల్లో ఇసుక ఎక్కడ చేర్పించాలో అక్కడికి చేర్పిస్తారు. ఈ దందా రాత్రి 9 నుంచి తెల్లవారుజాము 4గంటల వరకు కొనసాగుతోంది. కర్కెల్లి, దర్బాబాద్, ఉమ్రి మార్గంలో చెక్‌పోస్టు లేకపోవడంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అనుకోకుండా పోలీసులకు పట్టుబడిన రాత్రికిరాత్రే పేరు పలుకుబడి ఉన్న వారితో మేనేజ్ చేసుకుంటున్నారు. ఎక్కడా ఆర్డర్ లేకుంటే తక్కువ ధరలకు ఇక్కడి వ్యాపారులు ఇసుకను డంప్ చేసుకుని తర్వాత అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. మహారాష్ట్ర నుంచి ఇసుక తీసుకువచ్చినా ప్రభుత్వానికి చలానా కట్టి అనుమతి తీసుకోవాలి. ఎల్వత్, వాడవన, తొండాల వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేసినా, రవాణా చేసినా చర్యలు తప్పవు.

– క్రాంతికుమార్, జిల్లా మైనింగ్ అధికారి

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారత్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల, వేదికపై రమాదేవి, రామ్‌నాథ్, అయ్యన్నగారి భూమయ్య

- కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో మన దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ముందుగా పట్టణంలోని పలువురి ఇళ్లకువెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను స్వయంగా వివరించారు. అనంతరం సదస్సులో మాట్లాడుతూ కరోనా కాలంలో దేశం గర్వించేలా వ్యాక్సిన్ తయారుచేసి మన దేశంతోపాటు బయట దేశాలకు అందించిన ఘనత నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. శాస్త్రవేత్తలు మన దేశాన్ని కాపాడుతూనే ప్రపంచ దేశాలకు మేమున్నామన్న భరోసా కల్పించారన్నారు. చైనా బోర్డర్‌లో యుద్ధాన్ని అడ్డుకోవడం, 370 ఆర్టికల్ రద్దు బీజేపీ సాధించిన విజయాలన్నారు. జీ-20 సదస్సుకు మోదీ అధ్యక్షత వహించడం భారత్‌కు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, కో-కన్వీనర్ మయూరి చంద్ర, పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి శ్రావణ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వొడిసెల అర్జున్, మేధావులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దినోత్సవం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు, స్వయం ప్రతిపత్తిని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని, ఆర్టికల్ 370 ని తీసుకురావడాన్ని ఖండించారని గుర్తుచేశారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన తాత్కాలిక ప్రభుత్వంలో డాక్టర్ ముఖర్జీకి పరిశ్రమల మంత్రిత్వ శాఖను కేటాయించారని అయితే, 1949లో నెహ్రూ పాకిస్థాన్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్‌తో జరిపిన ఢిల్లీ ఒప్పందం (ఆర్టికల్ 370) అనంతరం 1950, ఏప్రిల్ 6న ముఖర్జీ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి, బయటికి వచ్చారని వెల్లడించారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని కశ్మీర్‌కి వెళ్తే అక్రమంగా శ్యామప్రసాద్ ముఖర్జీని అరెస్టు చేసి జైల్లో పెట్టి చంపేశారని గుర్తుచేశారు. ఆ రోజును బలిదాన దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి శ్రావణ్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, సీనియర్ నాయకులు న్యాయవాది వినోద్ కుమార్, నాయకులు ప్రేమ్‌కుమార్, వెంకటపతి, సురేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాకు మూడు డిగ్రీ గురుకులాలు

కౌటాల(సిర్పూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మూడు బీసీ డిగ్రీ గురుకులాల ఏర్పాటుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాజ్యోతి పూలే గురుకులాల డిగ్రీ కళాశాలలను ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి బీ వెంకటేశం ప్రకటించారు. దీంతో ఆయా జిల్లాలోని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో బీఎస్సీ డిజైన్, టెక్నాలజీ కోర్సుల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి తెలిపారు. జూన్ 28న దరఖాస్తుల స్వీకరణ ముగియనుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 7675897485, 9059663002 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దూడల పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా తరలిస్తున్న రెండు దూడలను పోలీసులు పట్టుకుని గోశాలకు అప్పగించినట్లు పట్టణ ఎస్సై ఎండీ సాదిక్ హుస్సేన్ తెలిపారు. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన ఇద్దరు గురువారం రాత్రి కిసాన్‌గల్లి బొర్రగణేశ్ వద్ద అనుమానాస్పద స్థితిలో దూడలను తీసుకెళ్తూ కనిపించారు. గస్తీలోని పోలీసులు వారిని పట్టుకుని దూడలను స్వాధీనం చేసుకున్నారు. దూడలను గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

12 మేకలు మృతి


మృతి చెందిన మేకలు

ఇంద్రవెల్లి: గుర్తు తెలియని మృగం దాడిలో మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని బిక్కుతండాలో చోటుచేసుకుంది. మేకల యజమాని రాథోడ్ అమర్‌సింగ్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం మేకలను మేతకు తీసుకెళ్లి ఇంటికి తీసుకొచ్చి కొట్టంలో బంధించారు. రాత్రి వర్షం కారణంగా అటువైపు ఎవరూ పోలేదు. ఆ సమయంలో మేకల మందపై గుర్తు తెలియని మృగం దాడి చేయడంతో 12మేకలు మృతి చెందాయి. ఐదు మేకలకు గాయాలయ్యాయి. మృతి చెందిన మేకల విలువ సుమారుగా రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి హీరలాల్, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయాలైన మేకలకు వైద్యం అందించారు.

గీత కార్మికుడికి గాయాలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర రాజాగౌడ్ తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం సాయంత్రం రాజాగౌడ్ పాత హత్తినిలోని తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
MINI GEEZER

■ శ్రీ గాయత్రీ మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793448]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462


మాయ'లేడీ' బాగోతం

- బయటపడుతున్న మరికొన్ని ఘటనలు
- ఉద్యోగాలు ఇప్పిస్తానని మరో నలుగురి నుంచి రూ.3లక్షలు వసూలు
- ఆందోళన చెందుతున్న బాధితులు
- ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు


इंडियन रेलवे केटरिंग एण्ड टूरिज्म कॉरपोरेशन लिमिटेड
(भारत सरकार का उद्यम मिनी रत्न)
INDIAN RAILWAY CATERING AND TOURISM CORPORATION LTD.
(A Govt. of India Enterprise- Mini Ratna)

JOINING LETTER

రైల్వే ఉద్యోగానికి సంబంధించి బాధితులకు అందించిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ



గూగుల్‌ప్లే ద్వారా రూ.15వేలు పంపిన బాధితురాలు

ఆదిలాబాద్‌టౌన్: మోసపోయేవారు ఉంటే మోసం చేసేవారికి కొదవ లేదన్నట్టుగా మాయ'లేడీ' తోట రజిత బాగోతం తవ్వినకొద్దీ బయటపడుతోంది. ఇటీవల రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని 10మంది నుంచి రూ.49.40 లక్షలు వసూలు చేసిన కి'లేడీ' రోజురోజుకూ అక్రమాలు బయట పడుతున్నాయి. ఓ మహిళ నుంచి రూ.2లక్షలు తీసుకోగా, ఇంకో మహిళ నుంచి రూ.50వేలు, ఇద్దరు నిరుద్యోగుల నుంచి రూ.15వేల చొప్పున డబ్బులు కాజేసింది. ఇటీవల ఆమె అరెస్టు అయిన విషయం బాధితులకు తెలియడంతో లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఆమె కటకటాలను లెక్కిస్తున్న విషయం తెలిసిందే. వీరితో పాటు మరికొంత మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.

తవ్వినకొద్దీ అక్రమాలే..

ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సుజాత నుంచి రూ.2లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. బాధిత మహిళ భర్త మృతిచెందగా ఆమె ఇద్దరు కుమార్తెలను కూలీనాలి చేసుకుంటూ పోషిస్తోంది. ఇందులో ఒక కుమార్తె వైకల్యంతో బాధపడుతుండగా, మరో చిన్నారి 5వ తరగతి చదువుతోంది. ఈమె డిగ్రీ పూర్తి చేసింది. ఉద్యోగం వస్తే ఆర్థిక సమస్యలు తీరుతాయనే ఆశతో ఆ లేడీకి డబ్బులు ముట్టజెప్పినట్లు చెబుతోంది. బాధిత మహిళకు తలమడుగు మండలం లక్ష్మిపూర్‌కు చెందిన ఓ మహిళ రజితను పరిచయం చేసింది. దీంతో మొదట ఆమె పేటీఎం ద్వారా రూ.45వేలు పంపించింది. మిగితా డబ్బులు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని చెప్పడంతో మెడలోని మూడున్నర తులాల బంగారం అమ్మి మిగితా డబ్బులు చెల్లించింది. మొదట డీఈఓ కార్యాలయంలో క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. ఆ ఉద్యోగం రాలేదంటూ కేజీబీవీలో అకౌంటెంట్, అగ్రికల్చర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. బాధితురాలు ఆమెను కలవడంతో బీసీ వెల్ఫేర్‌లో రికార్డు అసిస్టెంట్ అంటూ అనేక విధాలుగా తిప్పుకుంది. మూడు నెలల కిందట ఈమెతో పాటు నలుగురు వ్యక్తులను హైదరాబాద్‌కు పంపించింది. అక్కడ ఓ వ్యక్తిని కలవాలని తెలిపింది. వెంటనే వెళ్లకపోతే ఉద్యోగం రాదని, ఇచ్చిన డబ్బులు తిరిగి రావని నమ్మబలికింది. బాధితులు వెంటనే హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తికి ఫోన్ చేయగా అతను మరో వ్యక్తిని పంపించాడు. వారి నుంచి రెజ్యూమ్ తీసుకొని వెళ్లిపోయాడు. తర్వాత ఈ మాయలేడీకి ఫోన్ చేస్తే స్పందించలేదని బాధితురాలు వాపోయింది. అక్రమాలకు పాల్పడిన ఆ మహిళ గురించి ఇటీవల వార్తలు ప్రచురితం కావడంతో బాధితురాలు అవాక్కయ్యింది. ఏమి చేయాలో తెలియక సతమతమవుతోంది.

మరికొందరు...

ఇంద్రవెల్లి మండలం గౌరపూర్‌కు చెందిన నిరుద్యోగి నుంచి రూ.15వేలు తీసుకుంది. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించింది. ఐడెంటి కార్డు అందజేసింది. అతను నమ్మకపోవడంతో అక్కడికే ఆగిపోయింది. తాను ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని అడుగగా ఉద్యోగంలో చేరే మరో వ్యక్తి డబ్బులు ఇచ్చిన తర్వాత ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ప్రఫుల్ అనే వ్యక్తి నుంచి రూ.15వేలు తీసుకుంది. అతడికి కూడా రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించింది. దీంతోపాటు తలమడుగు మండలం ఐకేపీలో పనిచేసే ఓ మహిళ నుంచి రూ.50వేలు తీసుకుంది. ఈమెకు సోషల్ వెల్ఫేర్‌లో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసింది. ఇలా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. దాదాపు రూ.కోటి వరకు బాధితులకు టోకరా వేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పది మంది బాధితులు పోలీసులను ఆశ్రయించగా మిగితా వారు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం



రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానని రజిత ఇదివరకు పది మందిని మోసం చేసింది. వారినుంచి డబ్బులు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఆ మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాం. ఆమెకు డబ్బులు ఇచ్చిన వారెవరైనా ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతాం. నిరుద్యోగులెవరూ ఉద్యోగాల కోసం ఎవరిని నమ్మి మోసపోవద్దు.

– ఉమేందర్, డీఎస్పీ, ఆదిలాబాద్

తహసీల్దార్‌పై అనుచిత పోస్టులు చేసిన వ్యక్తి అరెస్ట్

లక్ష్మణచాంద: తహసీల్దార్‌పై అనుచిత పోస్టులు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన మాచట్టి శ్రీను, చామన్‌పెల్లి గ్రామానికి చెందిన వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు వీధి కుక్కలను పట్టుకెళ్లి వాటిని చంపి జింక మాంసం అంటూ విక్రయించేవారు. ఇదే క్రమంలో మండల కేంద్రానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి పెంపుడు కుక్కను మే నెల 30 న ఇంటి నుంచి అపహరించి దానిని చంపి జింక మాంసం అని నమ్మించిన చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించారు. ఇదే అదునుగా భావించిన మండల కేంద్రానికి చెందిన కుంటాల సాయన్న అనే వ్యక్తి గతంలో రెవెన్యూ సిబ్బందితో ఉన్న గొడవలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 7వ తేదీ రాత్రి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది జింక మాంసం అని కుక్క మాంసం తిన్నారని తప్పుడు మెసెజ్ టైప్ చేసి తను క్రియేట్ చేసిన యువ సైన్యం అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు మేరకు సాయన్నను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డిగ్రీలో 8 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పరీక్షలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో నలుగురు, భైంసాలోని సరస్వతి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో ఒకరు, మంచిర్యాలలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లుగా ఆయన పేర్కొన్నారు.

బీసీ హాస్టల్ కోసం వినతి


హైదరాబాద్‌లో బీసీ వెల్ఫేర్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తానూరు: ఎల్వి గ్రామంలో బీసీ హాస్టల్ మంజూరు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు స్థానిక నాయకులు హైదరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్ కమిషనర్ బి.నర్సయ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో 200 మంది విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. వారి సౌకర్యార్థం బీసీ వసతిగృహం మంజూరు చేయాలని కోరారు. రెండేళ్ల క్రితం హాస్టల్ మంజూరు కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భోసి గ్రామంలోని బీసీ వసతిగృహంలో 120 ఉన్న సీట్ల సంఖ్యను 175 వరకు పెంచాలని కోరారు. స్పందించిన కమిషనర్ ఎల్వి గ్రామంలో వసతులను పరిశీలించి హాస్టల్ మంజూరు చేసేలా కృషిచేస్తామన్నారు. భోసి గ్రామంలోని బీసీ హాస్టల్‌లో సీట్లు పెంచేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన పుస్తకాలు పట్టివేత


గదిని సీజ్‌చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిబాబు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని ఓ నివాస గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, తదితర సామగ్రిని శుక్రవారం విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఖానాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిబాబు వివరాల ప్రకారం.. ఓ నివాస గృహంలో పాఠ్యపుస్తకాలు, సామగ్రిని నిల్వ ఉంచి ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కీర్తి శశిందర్, విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివకుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గ ప్రసాద్‌లు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఎంఈవో మధుసూదన్‌ల సూచన మేరకు పాఠ్యపుస్తకాలు నిల్వ ఉంచి గదిని సీజ్ చేశారు. ఇంటి యజమాని, గది నిర్వాహకులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో పోలీసు సిబ్బంది సమక్షంలో ఇంటిని సందర్శించి గదిని రెండువైపులా సీజ్ చేశామని పేర్కొన్నారు. తదుపరి విచారణ అనంతరం శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు స్థానిక అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతోనే విద్యా వ్యాపారంగా మారి, పేదలకు అందని ద్రాక్షగా మారుతోందన్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాయితీపై నాణ్యమైన కొబ్బరి మొక్కలు


మొక్కలను పరిశీలిస్తున్న సందీప్ కుమార్

ఉట్నూర్‌రూరల్: కొబ్బరిసాగు చేసే రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన కొబ్బరి మొక్కలు అందించడంతో పాటు, రెండు సంవత్సరాల నిర్వహణ కోసం రాయితీ కూడా కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో మొక్క రూ.150 నుంచి రూ.250 వరకు ఉండగా ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో రూ.50 నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో మొక్కకు సంవత్సరానికి రూ.20 చొప్పున రెండు సంవత్సరాల పాటు రూ.40 రాయితీ సీడీబీ ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్, పాస్ ఫొటో, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో రావాలని, ఇతర వివరాలకు ఫోన్ నం. 8790230313 సంప్రదించాలని కోరారు.

ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణలు

- టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల డీటీసీ శ్యామ్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్ నాయక్


ఆదిలాబాద్‌టౌన్: నా ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు నాపై బురదజల్లే ప్రయత్నాలు చేశారని టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల డీటీసీ శ్యామ్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నా ప్రోత్సాహంతోనే తన భార్య రేఖాశ్యామ్‌నాయక్ రాజకీయాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. నా సతీమణిని రాజకీయంగా ఇబ్బందులు పెట్టాలనుకొని పరోక్షంగా కొందరు తనను టార్గెట్ చేశారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశానని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు వివరించారు. నాపై నమ్మకంతో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రవాణాశాఖ విషయమై ప్రభుత్వానికి లేఖ రాయడంతో రూ.100కోట్లు ప్రభుత్వ ఖజానాకు లాభమైందన్నారు. ప్రజలకుసేవ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగానికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తెలిపారు. రవాణ శాఖలో మొదట రాయలసీమలో, ఆ తర్వాత మంచిర్యాల, ఆదిలాబాద్, తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో టీజీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి వనజా రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శివ కుమార్, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ఉద్యోగ సంఘాల నాయకులు రాజేందర్ దేశ్‌పాండే, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాజు(ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన బ్రమ్మదండి రాజు (38) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... బ్రమ్మదండి రాజు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ద్విచక్ర వాహనం (స్కూటీ) పై భైంసా మండలం మహాగాం గ్రామంలోని భార్య, పిల్లలను చూసి నిర్మల్‌కు బయలుదేరాడు. ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు శివ కుమార్, అంజికుమార్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ శంకర్

గుడిహత్నూర్: మండలంలో జాతీయ రహదారి 44పై మన్నూర్ వద్ద జరిగిన ప్రమాదంలో సాయినగర్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... శంకర్ మన్నూర్ వద్ద చిన్న హోటల్ నడుపుతున్నాడు. ఎప్పటిలాగే సాయినగర్ నుంచి జాతీయ రహదారి మీదుగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం శంకర్‌ను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్సులో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ధర్మసాగర్ చెరువు కట్ట సమీపంలో కనిపించిన మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు పట్టణ ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... హన్మకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన నడిగొట్టు కోటి (33) పదేళ్ల క్రితం ఖానాపూర్‌కి వచ్చి కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఖానాపూర్‌కు చెందిన భర్త చనిపోయిన సునీతను వివాహం చేసుకున్నాడు. ఇటీవల మద్యానికి బానిసకావడంతో ఈ నెల 19న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే భార్య నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. మద్యం లేకపోవడంతో ఈ నెల 20న ఆస్పత్రిలో గోడ దూకి పారిపోయాడు. దీంతో అతడి భార్య సునీత పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 21న ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 22న ధర్మసాగర్ చెరువు కట్ట వద్ద మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కోటిగా గుర్తించి అతడి భార్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి మృతి

తలమడుగు: మద్యం మత్తులో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలమడుగు మండలంలోని ఉండమ్ గ్రామ సమీపంలో మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకాలోని బోధిడి గ్రామానికి చెందిన వివహార సంజీవ్ (48)ఉండమ్ గ్రామ రైల్వేస్టేషన్ సమీపంలో మృతి చెందాడు. సంజీవ్‌కు 2001లో మండలంలోని శాంతినగర్ చెందిన మాయ దేవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నెల 19వ తేదీన బోదిడి గ్రామం నుంచి బయలుదేరి వచ్చాడు. మద్యం మత్తులో ఉండమ్ రైల్వేస్టేషన్ సమీపంలో పడిపోయి మరణించారు. శుక్రవారం మధ్యాహ్నం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై అప్పారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఉన్న సెల్ ద్వారా కుటుంబీకులకు విషయం తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక గురువారం ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆమె కోసం చుట్టుపక్కల గాలించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్ కాలనీకి చెందిన మోచి రాహుల్ అనే యువకుడు అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మేస్త్రీ పనిచేస్తున్న యువకుడు రోజులాగే పని కోసం ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు తెలిసిన వారి వద్ద గాలించారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌గా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో శుక్రవారం సోదరుడు శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ నెల 21న రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం భర్త ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పోదాం పదా.. పాలానికి


బుర్కపల్లిలో సోయా విత్తనాలు వేస్తున్న రైతన్నలు

నేరడిగొండ: తొలకరి వర్షాలతో రైతులు పొలం బాట పట్టారు. ఇన్నీ రోజుల పాటు వర్షాలు లేక రైతులు వ్యవసాయ పనులను చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు మొదలుపెట్టారు. దుక్కులు దున్ని విత్తనాలు వేస్తున్నారు. ఇంటిల్లిపాది పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై సోయాబీన్, పెసర, మినుములు, కంది విత్తనాలు అందిస్తోంది. ఏదో మొక్కుబడిగా కాకుండా అన్ని విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.


బుగ్గారం(బి)లో ఇంటిల్లిపాదీతో కలిసి విత్తనాలు విత్తుతున్న రైతులు